

నర్సాపూర్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా, ఎస్పీ రోహిణిప్రియదర్శిని



శివ్వంపేటలో సాయుధ బలగాలతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీ

# ఓటర్లకు 'సీ- విజిల్' ఆయుధం

- రాజకీయ పార్టీల నాయకులు ప్రలోభపెట్టినా, బయపెట్టినా సీ-విజిల్ ఆప్‌లో ఫిర్యాదు చేయాలి
- 1950 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలి
- మెదక్ జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా, ఎస్పీ రోహిణిప్రియదర్శిని

నర్సాపూర్/ శివ్వంపేట/ మెదక్ అర్బన్/ నర్సాపూర్, అక్టోబర్ 27 : ఎన్నికల సమయంలో పోటీ చేస్తున్న అభ్యర్థులు లేదా రాజకీయ నాయకులు ప్రలోభపెట్టినా, బయభ్రాంతులకు గురిచేసినా ఓటర్లు 1950 టోల్‌ఫ్రీ నెంబర్‌కు లేదా సీ–విజిల్ ఆప్‌లో ఫిర్యాదు చే యాలని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా అన్నా రు. శుక్రవారం నర్సాపూర్ మున్సిపాలిటీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటర్ల అవగాహన చైతన్యసదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా, ఎస్పీ రోహిణిప్రియదర్శిని ముఖ్య అతిథు లుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు ఓటర్లను బయపెట్టిన, ప్రలోభాలకు గురిచేసిన ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు 1950 లేదా 100 టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి, సమాచారం ఇస్తే 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీ–విజిల్ ఆప్‌లో ఫిర్యాదు చేస్తే ఫిర్యాదుదారుడి సమాచారం గోప్యంగా ఉంటుందని తెలిపారు. నూతన ఓటర్లకు శుభాకాంక్షలు తెలిపారు. నవంబర్ 30న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. బీఎల్వోలు ఓటరు గుర్తింపు పత్రాలను అందజేస్తారని తెలిపారు. 2018 లో మెదక్ జిల్లాలో 81 శాతం పోలింగ్ శాతం నమోదయిందని, ఈసారి వందశాతం చేరాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిపా ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

**ఓటు హక్కును వినియోగించుకోవాలి : ఎస్పీ**

ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరూ నవంబర్ 30న తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ రోహి ణిప్రియదర్శిని సూచించారు. ఎలాంటి నాయకుడు కావా లో ఓటరే నిర్ణయించాలని తెలిపారు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యం మనదేశంలో ఉన్నదని, ప్రజలను పాలించే నాయకుడిని ప్రజలే నిర్ణయిస్తారని వెల్లడించారు. ప్రతిరోజూ మూడు మండలాల చొప్పున తిరుగుతూ ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా, భయానికి గురికాకుండా ఓటేయ్యాలని సూచించారు. ఓటర్లకు డబ్బులు ఇచ్చినా నేరమేనని ఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు, స్వీప్ నోడల్ అధికారి రాజిరెడ్డి, డీడబ్ల్యూవో బ్రహ్మాజీ, తహసీల్దార్ కమలాద్రి, బీఎల్వోలు, ఓటర్లు పాల్గొన్నారు.

**ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి**
**- శివ్వంపేట మండలంలో పోలీసుల కవాతు**

అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలంతా సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా, ఎస్పీ రోహణిప్రియదర్శిని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసులకు సూచించారు. ఈ మేరకు శివ్వంపేట మండలకేంద్రంతోపాటు దొంతి, గోమారం, కొంతాన్‌పల్లి గ్రామాల్లో సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఓటర్లు స్వేచ్ఛగా ఓటేసేందుకు పోలీసు వ్యవస్థ అండగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమాలను తప్పకుండా పాటించాలన్నారు. ఎవరైనా అల్లర్లు రేకెత్తించినా, ప్రజలను ఇబ్బందులకు గురిచేసినా, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీకు మేమున్నాం అని ప్రజలకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, తూప్రాన్ సీఐ శ్రీధర్, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీనివాస్‌చారీ, ఎస్సై రవికాంత్‌రావుతోపాటు సెంట్రల్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆర్వో కార్యాలయాలను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా**

సాధారణ ఎన్నికలు 2023లో భాగంగా మెదక్ నియోజకవర్గం ఆర్ఓ కార్యాలయాన్ని ఎస్పీ రోహిణిప్రియదర్శినితో కలిసి జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న సందర్భంగా ఆర్వో కార్యాలయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు చేశారు. ప్రతి నామినేషన్ పత్రాన్ని క్షుణంగా పరిశీలించడం, వచ్చిన నామినేషన్ పత్రాన్ని ప్రదర్శనలో పెట్టాలని, ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. నవంబర్ 3న నామినేషన్ నోటిఫికేషన్, 10న నామినేషన్ ఇవ్వడానికి ఆఖరి తేదీ, 13న నామినేషన్ల పరిశీలన, 15న నామినేషన్లు ఉపసంహరణ, 30న పోలింగ్, డిసెంబర్ 3న కౌంటింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. డిసెంబర్ 5 వరకు ఎన్నికల నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో మెదక్ ఆర్వో రాజేశ్వర్, అడిషనల్ ఎస్పీ మహేందర్, డీఎస్పీ ఫణీంద్ర, తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

**నర్సాపూర్ ఆర్వో కార్యాలయం పరిశీలన**

నర్సాపూర్ ఆర్వో కార్యాలయాన్ని ఎస్పీ రోహిణిప్రియదర్శిని, జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్వో శ్రీనివాసులు, డీఎస్‌వో రాజిరెడ్డి, పీడీ మెప్మా ఇందిర, మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, డీడబ్ల్యూవో బ్రహ్మాజీ, తహసీల్దార్ కమలాద్రి, తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.



డీఎస్పీ వెంకట్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

### 30న నారాయణఖేడ్‌లో

# సీఎం కేసీఆర్ సభ

- సీఎం సభాస్థలిని సందర్శించిన ఎస్పీ రూపేశ్
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, అక్టోబర్ 27 : సీఎం కేసీఆర్ ఈ నెల 30న నారాయణఖేడ్ పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని కరస్‌గుత్తి రోడ్డు ప్రాంతంలోని రెహమాన్ ఫంక్షన్‌హాల్ సమీపంలో నిర్వహిస్తున్న బహిరంగసభలో సీఎం కేసీఆర్ కేసీఆర్ పాల్గొననున్నారు. దీంతో శుక్రవారం సంగారెడ్డి ఎస్పీ రూపేశ్ సభాస్థలిని సందర్శించి భద్రతా ఏర్పాట్లపై స్థానిక డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఇతర అధికారులతో సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, భద్రతా అంశాలపై సూచనలు చేశారు. సీఎం పర్యటన ఏర్పాట్లను పోలీసులు, సిబ్బంది సమన్వయంతో చేయాలని ఆదేశించారు.

**సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే**

నారాయణఖేడ్‌లో ఈ నెల 30న సీఎం కేసీఆర్ పాల్గొననున్న ప్రజా ఆశీర్వాద సభ నేపథ్యంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సీఎం సభాస్థలిని సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం సభా వేదిక, సభా ప్రాంగణం, హెలిప్యాడ్ ఏర్పాట్ల విషయమై మున్సిపల్ వైస్ చైర్మన్ ఆహీర్ పరశురాం, నాయకులు వంశీధర్‌రెడ్డికి పలు సూచనలు చేశారు. ఇప్పటికే సభాస్థలి, హెలిప్యాడ్ స్థలాలను చదును చేసే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పనులను మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ నాయకులు పార్శెట్టి సంగప్ప, అంజాగౌడ్, హిదాయత్‌అలీ, రాజునాయక్, దత్తు, శంకర్ తదితరులు ఉన్నారు.



నాయకులతో సమాలోచనలు చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

# ఎన్నికల వ్యయాన్ని నిశితంగా పరిశీలించాలి

- విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలి
- ఎన్నికల్లో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం
- సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి శరత్




శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సంగాడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 27 : శాసనసభ ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సెక్టోరల్ అధికారులు, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ ఫ్లయింగ్ స్క్వాడ్, వ్యయ పరిశీలకులు, నిఘా బృందాల అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా పార్టీలు, అభ్యర్థుల ప్రచార పరిశీలన, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే చర్యలను నిరోధించడం, ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం, నిరంతర తనిఖీలు, ఆయా బృందాల పర్యవేక్షణ, పరిశీలనపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా నిఘా బృందాలు సమర్థవంతంగా, నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలని, క్షేత్రస్థాయి పరిశీలన చేసి వాస్తవాలను నిర్ధారించి చర్యలు చేపట్టాలన్నారు. నిఘా బృందాల దృష్టిని మళ్లించేందుకు పలువురు చేసే తప్పుడు ఫిర్యాదులపై జాగ్రత్తగా ఉండాలన్నారు. అధికార బృందాలకు ఇచ్చిన వాహనాలకు సాంకేతికతో కూడిన పీటీజీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

**తనిఖీల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి**

తనిఖీల సమయంలో సాధారణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా వ్యవహరించాలని సూచించారు. నగదును జప్తు చేస్తే రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. నగదును సీజ్ చేస్తే బాధితులకు గ్రీవెన్స్ కమిటీ గురించి వివరించి, భరోసా కల్పించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమస్యాత్మకంగా పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు.

ఎస్పీ రూపేశ్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేస్తే ఎన్నికల నిబంధనలను విధిగా పాటించాలన్నారు. ఎన్నికల వ్యయం, ప్రచార సరళి, ప్రలోభాల విషయంలో నిఘా బృందాలు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి విషయంపై అవగాహనతో పనిచేయాలని, సొంత నిర్ణయాలు తీసుకోరాదని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో నగేశ్, డీసీవో ప్రసాద్, డీఎస్పీలు, ఏఆర్వోలు, స్వీప్ అధికారి, రిటర్నింగ్, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

## సీజ్ చేసిన రూ. 1.47 కోట్లు విడుదల

సంగారెడ్డి జిల్లాలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సీజ్ చేసిన నగదును జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలోని గ్రీవెన్స్ కమిటీ సరైన ఆధారాలు పరిశీలించి, 55 కేసుల్లో రూ. 1,47, 87, 180 విడుదల చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రూ.50 వేల కంటే ఎక్కువ నగదును తీసుకుని వెళ్తే సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. సీజ్ చేసిన నగదుకు సంబంధించి సరైన ఆధారాలు జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సమర్పించి విడుదల చేసుకోవచ్చన్నారు. జహీరాబాద్ నియోజకవర్గం చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రూ.4,55,45,960 విలువైన 6,966.83 గ్రాముల బంగారం ఆభరణాలను సీజ్ చేశామని తెలిపారు. ప్రజలు నగదు విడుదలకు పూర్తి ఆధారాలతో గ్రీవెన్స్ కమిటీ అధికారులను లేదా 9100115691, 9281487272, 7799934135 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

KIDNEY STONES
★మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్ లేని హోమియో పరిష్కారం. 47 సం॥, అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. Ph: 9866007924, 9550336677, 040-27000580.
NT-320707

WANTED
★CIVIL Site Engineer with Experience 5 years. Job Location: Chanda Nagar. Contact: +91 9912990546.
NT-Narsa Reddy

★రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

★ఒక ప్రముఖ సర్వే సంస్థలో తెలంగాణ ఎలక్షన్ క్యాంపెయిన్ & సర్వే చేయుటకు రాజకీయ అవగాహన కలిగిన వెండార్స్ (500+టీం మెంబర్స్) కావలెను. సంప్ర: 7396856819, 7386886819.
NT-320424-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.